## క్లుప్తంగా

### మాతమ్మ జాతర ప్రారంభం


ప్రత్యేక అలంకారంలో మాతమ్మ

**బంగారుపాళెం:** మండలంలోని ఆండారెడ్డిపల్లె ఆదిఆంధ్రవాడలో మంగళవారం మాతమ్మ జాతరను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అంబళ్లు, సాయంత్రం పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా మాతమ్మ మూల విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు పూజలు చేపట్టారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

### అనాథ శవానికి అంత్యక్రియలు


అనాథ మృతదేహానికి దహనక్రియలు నిర్వహిస్తున్న జేఏసీ సభ్యులు

**బంగారుపాళెం:** అనాథ శవానికి మంగళవారం బంగారుపాళెం ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో అంతిమ సంస్కారాలను నిర్వహించారు. మూడు రోజుల క్రితం మొగిలి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు గుర్తుతెలియని ఆ మృతదేహాన్ని బంగారుపాళెం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతుని చిరునామా లభించక పోవడంతో అనాథ శవానికి తగ్గువారిపల్లె శ్మశానవాటికలో స్థానిక ముస్లిం జేఏసీ సభ్యుల సహకారంతో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ ద్వారక, గ్రామ కార్యదర్శి చెంగల్రాయులు, జేఏసీ అధ్యక్షుడు ఫిరోజ్అహ్మద్, కమిటీ సభ్యులు లాలు, షంషీర్, రియాజ్‌బాషా, ఫిరోజ్, సమీర్, మాలిక్ పాల్గొన్నారు.

### నేడు డయల్‌యువర్ డీఎం

**చిత్తూరు రూరల్ (కాణిపాకం):** చిత్తూరు నగరంలోని వన్‌డిపో పరిధికి సంబంధించి డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు డీఎం తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. వన్‌డిపో పరిధిలో ప్రయాణించే ప్రయాణికులు తమ సమస్యలను డయల్ యువర్ డీఎం దృష్టికి తీసుకుని రావచ్చునన్నారు. 99592 25674 నంబరుకు డయల్ చేయాలని ఆయన పేర్కొన్నారు.

### దోమ తెరలు వాడాలి


సరకల్లులో వృద్ధులకు బీపీ పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

**తవణంపల్లె:** దోమకాటుకు గురికాకుండా దోమ తెరలు వాడాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మంగళవారం మండలంలోని సరకల్లులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ 40 మంది రోగులకు వైద్య పరీక్షలు చేయించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు, వృద్ధులకు, గర్భిణులకు, బాలింతలకు పరీక్షలు చేసి, సూచనలు, సలహాలిచ్చారు. వర్షాకాలం గ్రామాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గర్భవతులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని, ఐరన్ మాత్రలు వాడాలని వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

**చిత్తూరు కలెక్టరేట్ :** ఏబీవీపీ 76వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం నగరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద విగ్రహం వద్ద నుంచి చేపట్టిన ర్యాలీని ఎమ్మెల్యే జగన్‌మోహన్ జెండా ఊపి ప్రారంభించారు. ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు పూజారి రాఘవేంద్ర మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పవన్, స్రవంత్, రిషి పాల్గొన్నారు.

# గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

**ఐరాల:** గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి 40 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా 9వ తేదీ పీహెచ్‌సీలో గర్భిణులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైరిస్క్‌తో ఉన్న గర్భిణులను గుర్తించి వీరికి ప్రత్యేక వైద్యసదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. మాతా శిశు మరణాలను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పీహెచ్‌సీల్లో కాన్పులు చేయించుకునేందుకు గర్భిణులు సంకోచించాల్సిన అవసరం లేదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారాన్ని గర్భిణులు క్రమం తప్పకుండా తీసుకోవాలని తెలిపారు. ఆకుకూరలు. తాజా పండ్లు, కూరగాయలు, గుడ్లు, పాలు రోజువారీ ఆహారంలో ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ జీవకళ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

**ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు తప్పనిసరి**

**గుడిపాల:** ప్రభుత్వాస్పత్రుల్లోనే తప్పనిసరిగా కాన్పులు చేయించుకోవాలని వైద్యాధికారి సంధ్య సూచించారు. మంగళవారం గుడిపాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత అభియాన్ కింద గర్భిణులతో సమావేశం నిర్వహించారు. వారికి వివిధ రకాల రక్త పరీక్షలు చేయించి,


గుడిపాల: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ చంద్రమహేష్

అవసరమైన ఆరోగ్య సలహాలు అందించారు. పీహెచ్‌సీలో 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు.

**ప్రతి ఒక్కరికీ వైద్యసేవలు**

ప్రతి ఒక్కరికీ వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ చంద్రమహేష్ సూచించారు. మంగళవారం పాపసముద్రం గ్రామంలో 104 ఆధ్వర్యంలో వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచంలోని రోగుల ఇంటి వద్దకే వెళ్లి చికిత్సలందిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం గర్భిణులు, బీపీ, మధుమేహ వ్యాధి గ్రస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కవిత, రుక్మిణమ్మ, చంద్రశేఖర్, బుజ్జమ్మ పాల్గొన్నారు.

**ప్రజల చెంతకే వైద్యం**

**ఐరాల:** ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా మారుమూల ప్రాంతాల్లో ప్రజల చెంతకే మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని పాలకలలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 80 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.




గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్, గుడిపాల: మాట్లాడుతున్న వైద్యాధికారి సంధ్య, ఐరాల: విద్యార్థినికి పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

# మేలైన పశుగ్రాసం అందించాలి

**బంగారుపాళెం:** రైతులు పాడి పశువులకు మేలైన పశుగ్రాసం(గడ్డి)మేతగా అందిస్తే పాల దిగుబడి ఆశించిన స్థాయిలో వస్తుందని బంగారుపాళెం ప్రాంతీయ పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ షేక్ ఆసీఫ్ అన్నారు. పశుగ్రాస వారోత్సవాలలో భాగంగా మంగళవారం మండలంలో తగ్గువారిపల్లెలోని పశువైద్యశాల ఆవరణలో పాడిరైతులకు పశుగ్రాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70 శాతం రైతులు పాడి జీవనంపై ఆధారపడి జీవిస్తున్నట్లు తెలిపారు. పాడిపోషణలో పశువులపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాడి పశువులకు మేలైన పశుగ్రాసంతో పాటు, గానుగ పిండి వంటి పోషక విలువలతో కూడిన మేత అందించాలన్నారు. గ్రాసం పెంపకంలో రైతులు తీసుకోవాల్సిన పద్ధతులను వివరించారు. ఏకవార్షిక, బహుళ వార్షిక పశుగ్రాసం ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. త్వరలో రైతులకు జొన్న, మొక్కజొన్న విత్తనాలను రాయితీపై సరఫరా చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు, పశువైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.


పశుగ్రాసం సాగుపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ షేక్ ఆసిఫ్

# సబ్‌స్టేషన్ ఆపరేటర్లకు వర్క్‌షాప్

**చిత్తూరు కార్పొరేషన్:** డివిజన్ పరిధిలోని సబ్‌స్టేషన్లలో పనిచేస్తున్న షిఫ్టు ఆపరేటర్లకు మంగళవారం చిత్తూరులోని విద్యుత్‌శాఖ అతిథిగృహంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ట్రాన్స్‌కో రక్షణ విభాగం డీఈ సతీష్ మాట్లాడుతూ ఆపరేటర్లు విధులకు సంబంధించి అప్‌డేట్‌గా ఉండాలని సూచించారు. డ్యూటీకి వచ్చిన వెంటనే షిఫ్టులో ముఖ్యమైన ఆపరేషన్స్ తెలుసుకోవాలని, ఎల్‌సీ వివరాలు కనుక్కోవాలన్నారు. అలారం స్విచ్ ఆన్ ఆఫ్ పరిశీలించాలని కోరారు. ఫీడర్ ట్రిప్ అయినప్పుడు లాగ్‌బుక్‌లో నమోదు చేయాలని చెప్పారు. వైడింగ్ ఆయిల్ టెంపరేచర్ ఎంత ఉందో చూసి ట్రాన్స్‌ఫార్మర్ పరిస్థితిని ఏఈలకు తెలియజేయాలన్నారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్ శబ్దాల్లో తేడా ఉంటే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని వెల్లడించారు. షిఫ్ట్ ఆపరేటర్ మారినప్పుడు బ్యాటరీ ఓల్టేజీ గమనించాలన్నారు. లైన్ క్లియరెన్స్ ఇచ్చినప్పుడు ముందుగా బ్రేకర్ ట్రిప్ చేసి ఆ మీటర్‌లోని వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఎల్‌సీ అడిగిన వారు ఫోన్ చేస్తేనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని స్పష్టం చేశారు. ఫోన్‌లో వినియోగదారులతో మర్యాదగా మాట్లాడి సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డీఈలు పద్మనాభపిళ్లై, శేషాద్రి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రక్షణ విభాగం డీఈ సతీష్

# పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**ఐరాల:** పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ వెంకటేశు సూచించారు. మంగళవారం వేదగిరివారిపల్లె పంచాయతీలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రోజూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. చిన్నపాటి ఆరోగ్య సమస్య వచ్చినా సమీపంలోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందన్నారు. ఐరాల పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి శ్యామల ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కుసుమకుమారి, సచివాలయ సిబ్బంది హరి, నాగరాజు, షహీన, రవితేజ పాల్గొన్నారు.

**పరిసరాల పరిశుభ్రత పాటించాలి**

**తవణంపల్లె:** విద్యార్థులు పరిసరాల పరిశుభ్రత పాటించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక సూచించారు. తవణంపల్లె జెడ్పీ హైస్కూల్‌లో డెంగీ, డయేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. రాత్రి పూట దోమ తెరలు వాడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. విద్యార్థులతో కలిసి పురవీధుల్లో డెంగీ, డయేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో విద్యార్థులతో వైద్య సిబ్బంది మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు వినయ్‌కుమార్, మోహనవేలు, సీహెచ్ఓ సుబ్రమణ్యం, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఉచిత ఇసుక విధానం


ఇసుక స్టాక్ పాయింట్‌లో కలెక్టర్ తనిఖీలు

**చిత్తూరు రూరల్ (కాణిపాకం):** ఉచిత ఇసుక విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. చిత్తూరు మండలం దిగువమాసాపల్లి గ్రామంలోని ఇసుక స్టాక్ పాయింట్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారులు యూపీఐ ద్వారా మాత్రమే నగదు చెల్లించాలన్నారు. చెల్లించిన నగదుకు రసీదు పొందాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు రెడ్డి తదితరలు ఉన్నారు.

### ఉచిత ఇసుకతో సామాన్యుడికి మేలు


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్

**చిత్తూరు అర్బన్:** ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పథకంతో సామాన్యుడికి ఎంతో మేలు చేకూరుతుందని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడు తెలిపారు. మంగళవారం చిత్తూరులోని టీడీపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజన్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఇసుకను నామమాత్రపు చార్జీలతో అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. సమావేశంలో నేతలు దొరబాబు, త్యాగరాజన్, కోదండ యాదవ్ పాల్గొన్నారు. అనంతరం పూనేపల్లెలోని టిడ్కో గృహాలను ఎమ్మెల్యే సందర్శించారు. అలాగే మురకంబట్టు అగ్రహారంలో శ్మశాన వాటికను పరిశీలించి సౌకర్యాలు కల్పించాలన్నారు. అక్కడే ఉన్న ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు.

# నాయకత్వ లక్షణాలు అవసరం



విద్యార్థులకు సూచనలిస్తున్న అకడమిక్ డైరెక్టర్ శైలజ

**చిత్తూరు కలెక్టరేట్ :** విద్యార్థులకు చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలు అవసరమని విజయం సీబీఎస్ఈ పాఠశాల అకడమిక్ డైరెక్టర్ శైలజ తెలిపారు. మంగళవారం జిల్లా సరిహద్దులో సుందరరాజపురం వద్ద ఉన్న విజయం పాఠశాలలో ఇన్వెస్టిట్యూర్(పెట్టుబడి) వేడుక నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేస్తూ జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవాలన్నారు. ఆ ఉద్దేశంతోనే పాఠశాల హౌస్‌కలర్స్‌గా పంచ భూతాలకు ఉపమానాలుగా ఉన్న రంగులను ఎంపిక చేశామని వివరించారు. విద్యార్థులు బుద్ధి, కుశలత, ఏకాగ్రత, క్రమశిక్షణ కలిగి ఉన్నతంగా విద్యను అర్జించాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం విద్యార్థులతో ఓటింగ్ కార్యక్రమం నిర్వహించి కేబినెట్‌కు ఎంపికైన పిల్లలతో ప్రమాణస్వీకారం చేయించారు. ప్రధానోపాధ్యాయులు ఎంబీ కౌసల్య పాల్గొన్నారు.

### కాణిపాకంలో కాకినాడ ఎమ్మెల్యే

**కాణిపాకం:** కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామిని మంగళవారం కాకినాడ రూరల్ ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. కోదండపాణి, రమేష్ పాల్గొన్నారు.

### ఇసుక స్టాక్ పాయింట్ ప్రారంభం

**చిత్తూరు రూరల్ (కాణిపాకం):** చిత్తూరు మండలం దిగువమాసాపల్లిలో మంగళవారం ఉదయం ఇసుక స్టాక్ పాయింట్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ పారదర్శకంగా ఇసుక సరఫరా జరగాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.

# పశువుల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత

**చిత్తూరు అగ్రికల్చర్:** పాడి పరిశ్రమకు పేరొందిన జిల్లాలో పశువుల ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యత ఇచ్చి, వాటి సంరక్షణకు ఇతోధికంగా వైద్యసేవలు అందివ్వాలని ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ రాష్ట్ర అధికారి డాక్టర్ భగీష్‌మిశ్రా కోరారు. మంగళవారం ఆయన జిల్లాలోని చిత్తూరు, గుడిపాల, పూతలపట్టు మండలాల్లో ఈఎంఆర్ గ్రీన్‌హెల్త్ సర్వీసెస్ పశు ఆరోగ్య సేవ సంచార వాహనాల సేవల పని తీరును ఆయన పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడారు. మూగజీవాల సమస్యలు తమ దృష్టికి వచ్చిన వెంటనే సంచార వాహనాలు ఆయా గ్రామాలకు వెళ్లి సత్వరమే మెరుగైన సేవలు అందించాలన్నారు. మారుమూల గ్రామాల నుంచి ప్రజలు సమస్యలు తెలియజేసిన వెంటనే స్పందించాల్సిన బాధ్యత సిబ్బందిపై అన్నారు. సమస్య తీవ్రమైన పక్షంలో పశువులను సమీప పశు వైద్య కేంద్రాలకు తరలించి మెరుగైన వైద్యసేవలు అందివ్వాలన్నారు. జిల్లాలో సంచార వాహనాలతో ఎన్ని మూగజీవాలకు వైద్యసేవలు అందించారో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ రామలింగేశ్వరరెడ్డి, జిల్లా మేనేజర్లు గణపతి, నరేష్ పాల్గొన్నారు.


చిత్తూరులోని పశు ఆరోగ్య సంచార వాహనాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ భగీష్‌మిశ్రా

# త్వరితగతిన యాంటిసిడెంట్ పరిశీలన

**చిత్తూరు కలెక్టరేట్ :** కొత్తగా విధుల్లో చేరే ఉద్యోగుల యాంటిసిడెంట్ పరిశీలనను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం కోరారు. ఈ మేరకు మంగళవారం ఆ సంఘ నాయకులు విజయవాడలో హోంమంత్రి వంగలపూడి అనితకు విన్నవించారు. ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అన్ని శాఖలలో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. సంఘం కార్యకలాపాలకు కార్యాలయం నిర్మించుకునేందుకు స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మహిళా అధ్యక్షులు ప్రభావతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

### స్టాప్ డయేరియాపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సీహెచ్ఓ లక్ష్మీనారాయణ

**యాదమరి(పూతలపట్టు):** మండలంలోని మాధవరం గ్రామంలో ప్రజలకు స్టాప్ డయేరియాపై కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ అవగాహన కల్పించారు. నీళ్ల విరేచనాల ద్వారా ఇబ్బందులు పడుతున్న వ్యక్తులను గుర్తించి, చికిత్సలు అందించాలని ఆశావర్కర్లకు తెలియజేశారు. అనంతరం గ్రామంలో పర్యటించిన గ్రామస్తుల వివరాలను సేకరించారు. చిన్నారులకు విరేచనాలు తరచుగా అవుతుంటే వారిని గుర్తించి వారికి ఓఆర్ఎస్‌తోపాటు 14 రోజులకు సరిపడా జింక్ టాబ్లెట్స్ అందించారు. వీటిని ఉపయోగించడం ద్వారా విరేచనాలు తగ్గిపోతాయని తెలిపారు. వీరి వెంట సూపర్‌వైజర్ లక్ష్మీపతి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

### డ్రైనేజీలపై ఆక్రమణల తొలగింపు

**చిత్తూరు అర్బన్:** నగరంలో డ్రైనేజీలపై ఆక్రమణలు తొలగింపును కార్పొరేషన్ అధికారులు చేపట్టారు. కమిషనర్ అరుణ ఆదేశాల మేరకు నగరపాలక అధికారులు డ్రైనేజీలను ఆక్రమించి వివిధ రకాల నిర్మాణాలు చేపట్టడాన్ని గుర్తించారు. మంగళవారం స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌–2024, సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యల్లో భాగంగా మురుగు నీటి కాలువల శుభ్రత ముమ్మరంగా సాగుతోంది. ఈ నేపథ్యంలో పలు ప్రాంతాల్లో డ్రైనేజీలకు అడ్డంకులు ఉండడంతో కమిషనర్ మండిపడ్డారు. ఆక్రమణలను తొలగించడానికి చర్యలు చేపట్టారు. ప్రణాళిక విభాగం అధికారులు పాల్గొన్నారు.


ఆక్రమణ తొలగింపును పర్యవేక్షిస్తున్న అధికారులు

### హెల్మెట్ ఉంటేనే అనుమతి

**చిత్తూరు అర్బన్:** ద్విచక్ర వాహనంపై కోర్టు లోపలికి వచ్చేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు ఆదేశించారు. మంగళవారం జిల్లా కోర్టులో న్యాయవాదులు న్యాయశాఖ అధికారులు సిబ్బందితో మోటార్ వాహన చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా జడ్జి మాట్లాడుతూ మోటార్ వాహన చట్టాలను ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాలన్నారు. అప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించడం సాధ్యమవుతుందన్నారు. ఇటీవల జిల్లాలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు కారణం నిబంధనలు పాటించకపోవడమేనన్నారు. ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఇటీవల రాష్ట్ర హైకోర్టు కూడా స్పష్టం చేసిందన్నారు దీన్ని కోర్టు భవనాల పరిధిలో తప్పనిసరిగా అమలు చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెన్నెల, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన న్యాయశాఖ అధికారులు, మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

# అసంపూర్తిగా 'కానుక'

- పాఠశాలలకు అందని యూనిఫామ్
- విద్యార్థులకు తప్పని ఎదురుచూపులు

**బైరెడ్డిపల్లె :** టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సర్కారు బడుల్లోని విద్యార్థులకు అవస్థలు మొదలైనట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు పూర్తవుతున్నా ఇప్పటికీ యూనిఫామ్ అందించకపోవడంపై మండిపడుతున్నారు. పూర్తిస్థాయిలో పుస్తకాలు సైతం పంపిణీ చేయకపోవడ దారుణమని విమర్శిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పాఠశాల మొదలైన రోజే జగనన్న విద్యాకానుక పేరిట పూర్తి విద్యాసామగ్రితో కిట్ అందజేసే వారని గుర్తు చేసుకుంటున్నారు. అందులో పాఠ్య పుస్తకాలు, నోట్సులు, యూనిఫామ్, బూట్లు, సాక్సులు ఉండేవని వివరిస్తున్నారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం విద్యాకానుక పేరు మార్చడంలో చూపి శ్రద్ధ, పిల్లలకు విద్యాసామగ్రిని సకాలంలో అందించడంలో చూపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**స్పష్టత కరువు**

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీలో ప్రభుత్వం జాప్యం చేస్తుంది. మండలంలో 84 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉండగా 1 నుంచి 10వ తరగతి వరకు 7,013 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి రెండు జతల యూనిఫామ్‌కు సరిపడా క్లాత్ పంపిణీ చేసి కుట్టు కూలీ కూడా ఇవ్వాల్సి ఉంది. అయితే మండలంలో ఇప్పటికీ ఒక విద్యార్థికి కూడా యూనిఫామ్ క్లాత్ పంపిణీ చేయలేదు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తే ఉపాధ్యాయుల నుంచి స్పష్టమైన సమాధానం కరువైంది. అసలు యూనిఫామ్ క్లాత్ ఇస్తారా..ఇవ్వరా అనే సందిగ్ధత నెలకొంది. కొంత మంది విద్యార్థులు గత ఏడాది ఇచ్చిన యూనిఫామ్‌నే వేసుకుని స్కూల్‌కు వస్తున్నారు. మరి కొంత మంది విద్యార్థుల యూనిఫామ్ చిరిగిపోవడంతో వారు ఇతర దుస్తులు వేసుకునే రావాల్సి వస్తోంది. టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదే ఇలా ఉంటే రాబోయే రోజుల్లో పరిస్థితి ఏంటనే అనుమానాలను తల్లిదండ్రులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యూనిఫామ్ పంపిణీకి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


కడపనత్తం ఉన్నత పాఠశాలలో గత ఏడాది ఇచ్చిన యూనిఫామ్‌తో హాజరైన విద్యార్థులు, అవి కూడా లేక కలర్ డ్రస్‌తో వచ్చిన పిల్లలు

**త్వరలోనే వచ్చే అవకాశముంది**

విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశాం. అందులో యూనిఫామ్ క్లాత్ లేదు. అది ఎప్పుడు వస్తుందో ఇంకా తెలియడం లేదు. త్వరలోనే వచ్చే అవకాశం ఉంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. క్లాత్ రాగానే అన్ని పాఠశాలలకు సరఫరా చేస్తాం.

– సుబ్రమణ్యం, ఎంఈఓ, బైరెడ్డిపల్లె

**ఇప్పటికే ఆలస్యమైంది**

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు యూనిఫామ్ క్లాత్ త్వరగా అందజేయాలి. ఇప్పటికే ఆలస్యమైంది. క్లాత్ ఇప్పుడు ఇచ్చినా టైలర్ దగ్గర మరో 15 రోజులు పడుతుంది. నాణ్యమైన క్లాత్ సరఫరా చేస్తే బాగుంటుంది. యూనిఫామ్ లేక పిల్లలు బడికి వెళ్లేందుకు నిరాకరిస్తున్నారు.

– సుగుణ, విద్యార్థి తల్లి, లక్కనపల్లె